గుడివాడలో వర్ష బీభత్సం

గుడివాడటౌన్: పట్టణంలో గురువారం ఈదురు గాలులతో కురిసిన వర్షం బీభత్సం సృష్టించింది. సాయంత్రం 3.30 గంటల సమయంలో ఒక్కసారిగా పెనుగాలులు వీచాయి. భయంకరమైన శబ్దాలతో ఉరుములు, మెరుపులు ప్రజలను భీతిల్లజేశాయి. సుమారు 100 కిలోమీటర్ల వేగంతో వీచిన గాలులు పట్టణాన్ని కుదిపేశాయి. పెద్ద పెద్ద వృక్షాలు నేలకొరిగాయి. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. పదుల సంఖ్యలో పూర్తిగా పడిపోగా పెద్ద సంఖ్యలో వంగిపోయాయి. దీంతో పట్టణం మొత్తం విద్యుత్ సరఫరా నిలిపివేశారు. వీటిని తిరిగి పునరుద్ధరించాలంటే ఎంత సమయం పడుతుందో ఊహించలేమని విద్యుత్ శాఖ అధికారులు అంటున్నారు. ఇటీవలి కాలంలో ఈ విధమైన గాలులతో కూడిన వర్షం ఎన్నడూ చూడలేదని స్థానికులు అంటున్నారు.

గుడ్లవల్లేరులో కుండపోతగా వర్షం

గుడ్లవల్లేరు: కాల వర్షం ఇంకా వదలటం లేదు. గుడ్లవల్లేరు మండలంలో గురువారం కుండపోతగా వర్షం కురిసింది. దీనితో ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రోడ్లు వర్షపునీటితో మునిగిపోయాయి. వాహన చోదకులు, పాదచారుల రాకపోకలకు కొంతమేరకు అవరోధం ఏర్పడింది.

పిడుగు పాటుకు పంట నష్టం

గుడ్లవల్లేరు: వేమవరంలో పిడుగు పడి రైతులకు పంట నష్టం వాటిల్లింది. గ్రామంలో రైతులు ఉయ్యూరు వెంకటేశ్వరరావు, సుందరమ్మకు చెందిన పొలంలో 50 సెంట్ల వరి కుప్పపై గురువారం పిడుగు పడింది. దీనితో రూ.25 వేల పంట నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు. పంటను కాపాడుకునేందుకు చుట్టుపక్కలున్న రైతులు ప్రయత్నించినా ఫలితం దక్కలేదు.


వర్షపునీటితో వర్షమున్నాడు ప్రధాన రహదారి


వేమవరంలో పంటను కాపాడుకునేందుకు నీటితో పంటను తడుపుతున్న రైతులు


గుడివాడలో నేలకొరిగిన వృక్షాలు


గుడివాడలో విరిగి నేలపై పడిన విద్యుత్ స్తంభాలు


భూషణగుళ్లలో పిడుగు పడి దగ్ధమైన వరి కుప్ప

అకాల వర్షాల్లో జరిగిన ఈ విపత్తుకు తమకు పంట నష్ట పరిహారం చేకూర్చాలని రైతులు విన్నవించారు. సంఘటనా స్థలికి చేరుకుని వీఆర్వో ఎం.రమేష్ పంట నష్టాన్ని అంచనా వేశారు.

భూషణగుళ్ళ(పెదపారుపూడి): మెరుపులు, ఉరుములతో కూడిన అకాల వర్షానికి పిడుగు పడి వరికుప్ప దగ్ధమైన సంఘటన మండలంలోని భూషణగుళ్ళలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. రెవెన్యూ అధికారుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కొల్లి శ్రీనివాసరావు చెందిన పొలంలో సుమారు 5 గంటల సమయంలో పిడుగు పడి రెండు ఎకరాల వరికుప్ప పూర్తిగా దగ్ధమయింది. విషయం తెలుసుకున్న ఇన్‌చార్జి వీఆర్వో చాట్ల అజయ్‌కుమార్ కుప్ప వద్దకు వెళ్లి వివరాలు సేకరించారు. పిడుగు పడిన సమయంలో పొలంలో ఉన్న రైతులు భయాందోళన చెందారు. ఆస్తి నష్టం రూ.70 వేలు ఉంటుందని వీఆర్వో అజయ్ తెలిపారు.

క్లుప్తంగా

ప్రత్తిపాడులో కాలువ తవ్వకం పనులు

మండవల్లి: మండలంలోని ప్రత్తిపాడు గ్రామంలో ఉపాధి హామీ పథకంలో పంట కాలువ తవ్వకం పనులను గురువారం ఉపాధి కూలీలు నిర్వహించారు. రూ.54 వేల నిధులతో పంట కాలువ తవ్వకం పనులు 34 మంది కూలీలు చేసినట్టు ఎంటీఏ నవీన్ తెలిపారు. ఈ పనుల ద్వారా కాలువలు అభివృద్ధి చెంది సాగునీరు, తాగునీటి సమస్యలు, చెరువులు అభివృద్ధి చేయడం ద్వారా పశువులకు తాగునీటి సమస్య ఉండదని చెప్పారు.

నేడు ఉయ్యూరులో మినీ జాబ్‌మేళా

పామర్రు: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజి, ఎస్ఈఈడీఏపీ వారి సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ఉయ్యూరు మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎస్.శ్రీనివాసరావు గురువారం తెలిపారు. పామర్రులో ఆయన మాట్లాడుతూ ఉయ్యూరు బస్ డిపో సమీపంలోని శ్రీలంక కాలనీలో గల నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(ఎన్ఏసీ) ట్రెనింగ్ సెంటరులో ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ మేళాలో శ్రీ సుధీర్ టింబర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో గల వివిధ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐటీఐ, డిగ్రీ, బీటెక్, ఎంబీఏ పూర్తి చేసిన నిరుద్యోగ యువకులు అర్హులని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 79813 68429 నంబరును సంప్రదించాలని కోరారు.

27న 25 వాహనాల బహిరంగ వేలం

గుడివాడటౌన్: మోటారు వాహన చట్టాన్ని ఉల్లంఘించి తిరుగుతున్న, వివిధ అక్రమ కేసుల్లో పట్టుబడిన 25 వాహనాలను ఈనెల 27వ తేదీన బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ రవాణా శాఖ అధికారి ఎ.విజయసారధి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఏలూరు రోడ్డులో జనార్ధనపురం సమీపంలో గల డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్ వద్ద ఉదయం 11 గంటలకు వేలం జరుగుతుందన్నారు. వేలం వేసే వాటిలో 21 మోటారుసైకిల్‌లు, 1 మినీ స్కూల్ బస్సు, 1 భారీ సరుకు రవాణా వాహనం, 1 ఆటోరిక్షా, 1 మ్యాక్సీ క్యాబ్ ఉన్నాయన్నారు. పాటలో పాల్గొనదలచిన వారు రూ.3 వేలు ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనవచ్చునన్నారు.

మొవ్వ పరీక్ష కేంద్రంలో సిట్టింగ్ స్క్వాడ్ తనిఖీలు

మొవ్వ: మండల కేంద్రం మొవ్వ గ్రామంలోని క్షేత్రయ్య జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్ పరీక్ష కేంద్రంలో గురువారం సిట్టింగ్ స్క్వాడ్ బృందం తనిఖీలు నిర్వహించారు. కూచిపూడి పోలీస్ స్టేషన్ నుంచి పేపర్లు తెచ్చినప్పటి నుంచి మొవ్వ సబ్ పోస్టాఫీస్‌లో పరీక్షా పత్రాలు భద్రపరిచే వరకు సిట్టింగ్ స్క్వాడ్ (అవనిగడ్డ, బంటుమిల్లి కళాశాలల అధికారుల) బృందం పర్యవేక్షించారు. మొదటి సంవత్సరం లెక్కలు 1బి, జువాలజీ, హిస్టరీ పరీక్షలకు 174 మంది విద్యార్థులకు గాను ఏడుగురు గైర్హాజరైనట్లు సీఎస్ కె.కిరణ్ కుమార్, డీవో ఎల్.హిరణ్మయి తెలిపారు.

కరకట్ట ర్యాంపు అభివృద్ధి పనులు ప్రారంభం

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు నుంచి పాములలంక వెళ్లే కరకట్ట ర్యాంపు అభివృద్ధి పనులను వైస్ ఎంపీపీ మెల్లంపల్లి వెంకటేశ్వరరావు గురువారం ప్రారంభించారు. కరకట్ట ర్యాంపు అధ్వానంగా మారటంతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు ఆయన తెలిపారు. కరకట్ట ర్యాంపు, సొసైటీలో డొంక రహదారి అభివృద్ధి పనులను మండల పరిషత్ నిధులు రూ.3 లక్షలతో చేపట్టినట్లు వెంకటేశ్వరరావు తెలియజేశారు. సర్పంచ్ శీలం రమేష్, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు సోలే నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో రోగనిర్ధారణ మంచిది

గుడివాడటౌన్: రోగ నిర్ధారణ సమయంలో నాణ్యతా ప్రమాణాలతో కూడిన పరికరాలు వినియోగించాలని పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రంగారావు అన్నారు. స్థానిక ఏలూరు రోడ్‌లోని చిన గాంధీబొమ్మ సెంటర్‌లో ఏర్పాటు చేసిన స్పెక్ట్రమ్ డాక్టర్ డయాగ్నస్టిక్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. బీపీ, షుగర్, చర్మవ్యాధులు, గుండెకు సంబంధించిన పరీక్షలతో పాటు కంటి పరీక్షలు కూడా నిర్వహించారు. అవసరమైన వారికి కళ్లజోళ్లు ఉచితంగా అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ పాలడుగు వెంకట్రావు, డాక్టర్ కె.ప్రణీత్, డాక్టర్ పి.నిశాలి, డాక్టర్ ఇ.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మసీదుల వద్ద పారిశుద్ధ్య సమస్య లేకుండా చూడాలి

గుడివాడటౌన్: రంజాన్ నెల ప్రారంభమవుతున్న సందర్భంగా మసీదుల చుట్టుపక్కల ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా చూడాలని ముస్లిం నాయకులు కోరారు. వారు ఈమేరకు గురువారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వి.మురళీకృష్ణకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు షేక్ బాజీ, ఆలీ సాహెబ్, సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ విగ్రహ ప్రతిష్టకు శంకుస్థాపన

పమిడిముక్కల(పామర్రు): మండలంలోని మామిళ్లపల్లి గ్రామ శివారు గంధ్రపువాని గూడెంలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం ఏర్పాటుకు గురువారం వైఎస్సార్‌సీపీ నాయకులు భూమి పూజ చేశారు. విగ్రహాన్ని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఉచితంగా అందజేస్తున్నారు. విగ్రహం దిమ్మెకు అయ్యే ఖర్చు రూ.50 వేలు గ్రామ సర్పంచ్ ఆముదాలపల్లి సుబ్రమణ్యం భరిస్తున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు యలమంచిలి గణేష్, వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్, నియోజకవర్గ బూత్ కన్వీనర్ మారపాక మహేష్, ఉపాధ్యాయ దళిత నాయకులు గంధ్రపు శీనయ్య, ఎస్సీ సెల్ నాయకులు బుజ్జి, అగినపర్రు పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కినేని సతీష్, మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు బంధ్రపల్లి నాగరాజు, ఉప సర్పంచ్ గంధ్రపు వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కొడాలి రవి, జి.పేరూరు, ఏసుపాదం, జి.రాజేందర్, చీలి వెంకటేశ్వరవరావు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

ముదినేపల్లి రూరల్: ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకుని పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని వడాలి జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు బీఎస్ నాగేశ్వరరావు సూచించారు. గురువారం ఏర్పాటుచేసిన పాఠశాల పదో తరగతి విద్యార్థుల వీడ్కోల సమావేశంలో ఆయన మాట్లాడారు. పబ్లిక్ పరీక్షల్లో వడాలి జెడ్పీహైస్కూల్ విద్యార్థులు ఏటా నూరుశాతం ఉత్తీర్ణత సాధిస్తున్నట్టు చెప్పారు. ఈ ఏడాదీ అదేవిధంగా ఫలితాలు సాధించి హైస్కూల్‌కు గుర్తింపు తేవాలన్నారు. అనంతరం సీనియర్ ఉపాధ్యాయుడు సీహెచ్ నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

చిరుధాన్యాల గురించి తెలుసుకోవాలి

పెదమద్దాలి(పామర్రు): చిరుధాన్యాలను తీసుకోవడం వలన కలిగే ప్రయోజనాలను అందరికీ తెలియజేయాలని ఐసీడీఎస్ సీడీపీవో వి.భానుశ్రీ అన్నారు. మండలంలోని పెదమద్దాలి గ్రామంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం గురించి గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాలలో పోషక విలువలు ఉంటాయని, మనం తీసుకునే ఆహారంలో చిరుధాన్యాలు తప్పనిసరిగా ఉండేలా చూడాలని అన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వై.పుణ్యవతి, గ్రామ సర్పంచ్ బి.శాంతకుమారి, ఎంపీటీసీ కె.రాజ్యలక్ష్మి, సీహెచ్‌వో బి.ఉదయ్‌కిరణ్, ఏఎన్ఎం పి.రాణి, ఎంఎస్‌కే మమత, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

మొవ్వ: చిరుధాన్యాల వినియోగం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చునని స్త్రీ సంక్షేమ శాఖ కృష్ణా జిల్లా పీడీ ఎస్.సువర్ణ తల్లులకు, గర్భిణులకు సూచించారు. మొవ్వ ఐసీడీఎస్ కార్యాలయంలో గురువారం పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా మొవ్వ, ఘంటసాల, చల్లపల్లి మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలకు, గర్భిణులకు, బాలింతలకు చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. చిరుధాన్యాల ద్వారా శరీరానికి కావాల్సిన సమతుల ఆహారం లభించటమే కాకుండా రోగనిరోధక శక్తిని పెంపొందిస్తుందని వెల్లడించారు. ఈ సందర్భంగా చిరుధాన్యాలతో తయారు చేసిన పోషకాహారాల ప్రదర్శనను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తూము పూర్ణ చంద్రరావు, సీడీపీవో పి.భానుమతి, తహసీల్దార్ సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్, వైద్యులు వేదరాజ్, సీహెచ్ రాజేశ్వరి, ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ వి.మంజుల, సూపర్‌వైజర్లు సలీమున్నీసా, విశ్రాంతమ్మ, మేరి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.


పెదమద్దాలిలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీవో భానుశ్రీ

ఆరోగ్యకరమైన పోషక ఆహారం తీసుకోవాలి

గుడివాడరూరల్: గర్భవతులు, బాలింతలు, తల్లులు ఆరోగ్యంగా ఉండటానికి పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో విజయ ఫ్లోరెన్స్ అన్నారు. పోషక పక్వాడ వారోత్సవాల్లో భాగంగా ఈనెల 20 నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు నిర్వహించే కార్యక్రమాల్లో భాగంగా గురువారం పట్టణంలోని 3వ వార్డు 1, 2, కొమరగుండం 4వ వార్డు అంగన్‌వాడీ కేంద్రాల్లోని తల్లులకు, బాలింతలకు, గర్భిణులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీడీపీవో మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీల ద్వారా గర్భిణులు, బాలింతలు, తల్లులకు పోషక విలువలున్న ఆహారం అందిస్తుందన్నారు. పిల్లలకు సైతం పోషక విలువలున్న ఆహారాన్ని ఇవ్వడం ద్వారా వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధను ప్రభుత్వం కనబరుస్తుందన్నారు. చిరు ధాన్యాలు ఉన్న ఆహారం తీసుకోవడం వల్ల పోషక విలువలు పెంచుకోవచ్చన్నారు. తల్లులు ఆహార విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బీకేడీ భవానీ, యూహెచ్‌సీ రామారావు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశవర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


మొవ్వలో పోషకాహార ప్రదర్శనను పరిశీలిస్తున్న పీడీ సువర్ణ

చిరుధాన్యాలతో రక్త వృద్ధి

పెదపారుపూడి: గర్భిణులు, బాలింతలు చిరుధాన్యాలు తీసుకోవటం వలన రక్త వృద్ధి పెరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.శివనాగమణి తెలిపారు. మండల కేంద్రమైన పెదపారుపూడిలోని అంగన్‌వాడీ సెంటర్‌లో గురువారం పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ నాగమణి మాట్లాడుతూ చిరుధాన్యాలు వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. చిరుధాన్యాలు తీసుకోవటం ద్వారా ఎముక పుష్టి పెరుగుతుందన్నారు. బలహీనత, నీరసం, అలసట వంటివి దరిచేరకుండా ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, పాల్గొన్నారు.

చిరు ధాన్యాలతో చక్కటి ఆరోగ్యం

కైకలూరు: చిరుధాన్యాలతో చక్కటి ఆరోగ్యాన్ని పొందవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య అన్నారు. పోషణ్ పక్వాడా ప్రచార కార్యక్రమాల్లో భాగంగా వెలంపేట అంగన్‌వాడీ కేంద్రం వద్ద గర్భిణులు, బాలింతలకు గురువారం అవగాహన కలిగించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు చిరుధాన్యాల అవశ్యకతను ప్రజలకు వివరించాలన్నారు.

చెరువుల అభివృద్ధితో గ్రామాల పురోభివృద్ధి

పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్

నెమ్మలూరు(పామర్రు): గ్రామాల్లోని చెరువుల అభివృద్ధి పనులతో గ్రామాల పురోభివృద్ధి జరుగుతోందని పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. మండలంలోని నిమ్మలూరు శివారు మలయప్పన్నపేటలో చెరువు పూడిక తీత పనులను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలోని ఆరున్నర ఎకరాల చెరువులో గత కొంతకాలంగా పేరుకు పోయిన పూడికను తీసి వచ్చిన మట్టితో చెరువు గట్లను అభివృద్ధి పరుస్తామని అన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా ఈ పనులను నిర్వహిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పల్లికొండ రత్నకుమారి, గ్రామ సర్పంచ్ గోపాలకృష్ణ, ఈసీ రామకృష్ణ, ఫీల్డు అసిస్టెంట్ సుస్మిత, మేట్లు, ఉపాధి కూలీలు స్థానిక పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


నెమ్మలూరులో చెరువు అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మండవల్లి/కైకలూరు: మండవల్లి సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం పరిధిలోని మండవల్లి, ముదినేపల్లి మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్త 1, అంగన్‌వాడీ సహాయకుల పోస్టులు ఐదింటికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కైకలూరు ఐసీడీఎస్ సీడీపీఓ బందెల ఆనంద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు ఈనెల 31సాయంత్రం 5 గంటలలోపు రెండు సెట్ల దరఖాస్తు ఫారాలను మండవల్లి ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. ముదినేపల్లి మండలం చేవూరిపాలెంలో అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు (బీసీబీ), మండవల్లి మండలం లోకుమూడి-1 (ఎస్సీ), నాగభూషణపురం (ఓపెన్), మండవల్లి-1 (ఓపెన్), ముదినేపల్లి మండలం కోడూరు-1 (ఎస్సీ), చిగురుకోట (ఓపెన్)లో అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నట్టు తెలిపారు. అంగన్‌వాడీ సహాయకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నామని ఐసీడీఎస్ ప్రాజక్టు సీడీపీవో బి.ఆనంద్ గురువారం తెలిపారు. కైకలూరు మండలం సోమేశ్వరం (ఎస్సీ), కై కలూరు 15వ వార్డు (బీసీ-డీ), కలిదిండి మండలం వెంకటాపురం (ఎస్సీ), కొండంగి (ఓసీ) అంగన్‌వాడీ కేంద్రాలలో సహాయకురాలుగా పని చేయుటకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

26న వైఎస్సార్ ఆసరా వారోత్సవాలు

ముదినేపల్లి రూరల్ : వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడత వారోత్సవాలను విజయవంతం చేయాలని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ తహసీల్దార్ కె.శ్రీనివాస్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 26న స్థానిక జెడ్పీ హైస్కూల్లో వారోత్సవాలు నిర్వహిస్తామని చెప్పారు. వారోత్సవాలను ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమానికి మండలంలోని డ్వాక్రా మహిళలు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొనాలని కోరారు. సమావేశంలో వెలుగు ఏపీఎం బి.సత్యనారాయణ, పలువురు సీసీలు పాల్గొన్నారు.

చేపల చెరువు వేలం పాట ఖరారు

ముదినేపల్లిరూరల్: మండలంలోని చేవూరు శ్రీలక్ష్మీనారసింహ ఆలయ చేపలచెరువుకు వేలంపాటలు గురువారం నిర్వహించారు. ఆలయానికి గ్రామంలో ఉన్న 1.95 ఎకరాల చేపల చెరువు మూడేళ్ల పాటు లీజుకు ఇచ్చేందుకు ఎండోమెంట్స్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వి.సుధాకర్, కార్యనిర్వహణాధికారి శింగనపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించగా, ఏడాదికి రూ.1,01,400కి పాట పాడుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వల్లభనేని సంపూర్ణ, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

స్కానింగ్ కేంద్రాలు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి

గుడివాడటౌన్: లింగ నిర్ధారణ ఎంపిక నిషేధ చట్టం అమలు చేయడంలో భాగంగా ప్రతి ఆసుపత్రిలోని స్కానింగ్ కేంద్రాలు విధిగా క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ ఏపీజీఓవీ డాట్ ఇన్ లో ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా నమోదు చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ గీతాబాయి తెలిపారు. పట్టణంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రులలో గురువారం ఆమె తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రైవేట్ యాజమాన్యాలలో గల స్కానింగ్ సెంటర్ల వివరాలన్నీ ప్రభుత్వ దృష్టిలో ఉండాలని అలా నమోదు చేసుకోని కేంద్రాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే ఐఎంఏ గుర్తింపు సైతం రద్దు చేస్తామని హెచ్చరించారు. స్కానింగ్ కేంద్రాలకు వచ్చిన గర్భిణుల వివరాలు ప్రభుత్వానికి తెలియజేయాలన్నారు. లింగ నిర్ధారణ చేస్తున్నారని సమాచారం ఇచ్చిన వారికి పారితోషికం ఉంటుందని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విద్యా బోధకుడు డాక్టర్ బి.రాజేంద్ర కుమార్ పాల్గొన్నారు.


స్కానింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న వైద్య బృందం

ఈనెల 31 వరకు ఆధార్ సేవలు



పామర్రు: ఆధార్ నమోదు కార్యక్రమం ఈనెల 31వ తేదీతో ముగుస్తుందని ఆధార్ కేంద్ర నిర్వాహకుడు మోరా సుధాకర్‌రెడ్డి గురువారం తెలిపారు. ఆధార్‌కు సంబంధించి పది రకాల సేవలను అందజేస్తారన్నారు. బయోమెట్రిక్ అప్డేట్‌కు రూ.100 చార్జి అవుతుందని, 1,2,4,5,6,7,8 సేవలకు రూ.50 చార్జి అవుతుందని అన్నారు. ఆధార్ సేవా కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

సుబ్బారాయుడికి విరాళం



ముదినేపల్లిరూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి మండవల్లి మండలం లింగాల గ్రామానికి చెందిన ఓలేటి మణి భీమరాజు దంపతులు రూ.10,116 ఆలయ చైర్మన్ శొంఠి నాగరాజుకు ఈఓ నేల సంధ్యకు అందజేశారు. అంతరాలయ ముఖద్వారానికి వెండి తాపడం నిమిత్తం విరాళంగా ఇచ్చారు.

దేవరపల్లిలో ఎన్ఎస్ఎస్ శిబిరం

తోట్లవల్లూరు: విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవాభావం కూడా కలిగి ఉండాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ కళాశాల(బాపట్ల) అసోసియేట్ డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని దేవరపల్లిలో బాపట్ల వ్యవసాయ విద్యార్థుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్ఎస్ఎస్ సేవా శిబిరాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. అగ్రికల్చర్ బీఎస్సీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు సేవా శిబిరంలో పాల్గొంటున్నట్లు శ్రీనివాసరావు చెప్పారు. వారం రోజులపాటు గ్రామంలో వివిధ సేవా కార్యక్రమాలను విద్యార్థులు నిర్వహిస్తారన్నారు. సర్పంచ్ మరీదు వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ భీమవరపు శ్రీలక్ష్మి, ఉప సర్పంచ్ కొల్లి కిరణ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ అపర్ణ, డాక్టర్ సువర్ణలత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ జ్యోతి, డాక్టర్ ఉషారాణి పాల్గొన్నారు.

స్టేడియం ఉద్యోగులకు నూతన వస్త్రాలు

గుడివాడటౌన్: ది గుడివాడ వాకర్స్ అసోసియేషన్ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఎన్టీఆర్ స్టేడియం ఉద్యోగులకు నూతన వస్త్రాలు బహూకరించారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నారాయణరెడ్డి, స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి పర్వతనేని ఆనంద్, వాకర్స్ అసోసియేషన్ మహిళా అధ్యక్షురాలు రమ్యారెడ్డి వితరణతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు పాలేటి చంటి, మున్సిపల్ మాజీ చైర్మన్ లంకదాసరి ప్రసాదరావు, క్లబ్ కార్యదర్శి శివ, కోశాధికారి లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్యశిబిరం

గుడివాడటౌన్: గుడివాడ లయన్స్‌క్లబ్ ఆఫ్ గుడివాడ ప్రగతి ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక టెలిఫోన్ నగర్ స్వామి అయ్యప్ప దేవస్థానం ప్రాంగణంలో జరిగిన ఈ వైద్యశిబిరంలో 150 మందికి పైబడి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మల్లంపల్లి వెంకట్రావు, జోన్ చైర్‌పర్సన్ ఆర్.వేణుబాబు, కార్యదర్శి ఎన్.శేషగిరిరావు, కోశాధికారి ఎన్.నవీన్ పాల్గొన్నారు.

మెనూ సక్రమంగా అమలుచేయాలి

ముదినేపల్లిరూరల్: విద్యాశాఖ ఆదేశాల మేరకు విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకం మెనూ సక్రమంగా అమలు చేయాలని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ ఉపాధ్యాయులకు సూచించారు. స్థానిక జెడ్పీ హైస్కూల్లో మధ్యాహ్న భోజన పథకం అమలును గురువారం ఆయన పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. స్టాకు రిజిస్టర్లు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం పోషకాహారాన్ని మధ్యాహ్న భోజనం ద్వారా అందిస్తున్నట్టు చెప్పారు. మండల పరిషత్ ఏఓ రమణరావు జూనియర్ అసిస్టెంట్ సుబ్బారావు, వెలుగు ఏపీఎం బి.సత్యనారాయణ ఎంపీపీ వెంట ఉన్నారు.


విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ